
కథ

# ఘోష



## కాశీభట్ల వేణుగోపాల్

అప్పుడింకా ఆకాశం భూమీ సయోధ్యతోనే వున్నాయి.

క్షణం క్రితం ఆకాశం కిందికి జారిన మేఘం పులకరింపుతో కడలి అలని కౌగిలించుకుంటోంది.

క్షితిజరేఖ యింకా ఎర్రబారలేదు.

నలుపు తెలుపుల బూడిద వర్ణం... కలలనూ అలలనూ కలిపి బొమ్మలు గీస్తోంది... ఉప్పటి ఆ సముద్రపు గాలి...

దాన్ని కాంతిహీనంగా చప్పరిస్తూ నేను...

ఏ గాలి మడతల్లో... ఏ చర్మపు కొలతల్లో?

అప్పుటెప్పటిదో ఉన్మిషిత కాయన కాచిన ఫలమై నేడు...

శూన్యం... అదీ మూడు సముద్రాల కౌగిట్లో...

కన్యాకుమారీ!

నా డయిరీ పేజీల్లో ఒదిగిన చిరిగిన పాత కాగితమా!

నా మనసు ముడుతల్లో నక్కిన సృక్కిన... ఎప్పటికీ బయల్వెడలని భావనా తరంగమా! కన్యాకుమారీ! కన్యాకుమారీ!

క్రమంగా మసక సంధ్య చీకటిగా మారుతోంది... పడమటి ఆకాశంలో అరుణిమలో నలుపు కలుస్తోంది...కారిడార్ చీకట్లో వంటరిగా నేను.

** ** **

కన్యాకుమారికీ నాకూ అవినాభావ సంబంధం... నేను నా మొట్టమొదటి నవల పూర్తి చేసిందిక్కడే...

అయితే ఇప్పట్లా వంటరితనం అప్పుడు వేధించలేదు... నా చుట్టూతా అక్షరాలు... ఏకబిగిన ముప్ఫైరోజులు...

నవల పూర్తిచేసిన మరుక్షణం మహోత్కృష్టమైన ఆనందం... ఆర్గాస్మాక్ ప్లెషర్... ఆ తర్వాత మూడు సముద్రాలకీ వీడ్కోలు పలికి... నాలో నాల్గో సముద్రాన్ని నింపుకుని వెళ్లా అప్పుడు... ఇప్పుడు మహా శూన్యాన్ని చుట్టుకుని వచ్చా...

'సన్‌రైజ్ వ్యూ' గెస్టౌస్‌లో దిగా... చీకటిగా వున్న కారిడార్లో పేముకుర్చీలో కూచుని.... ఎదురుగా టీపాయ్ మీద... సముద్రపు చలిగాలికి నషా పొరల వెచ్చటి ఆవిర్ల... సెగల... సీసా తోడుగా... సముద్రపు హోరు వింటూ...

గెస్ట్‌హౌస్ ఎదురుగా ఓ కారొచ్చి ఆగింది. దిగిన వాళ్లకి వాచ్‌మన్ నా పక్కగదినే కేటాయించాడు. వాళ్లు లోపలికెళ్లి కాస్తా సద్దుమణిగాక, ఓ అమ్మాయి బైటికొచ్చి "బాషా" అని గట్టిగా కేకేసి పిలిచింది. స్వరం విని అమ్మాయో... అమ్మాయిల తల్లో చెప్పడం కష్టంకానీ నాకెందుకో అమ్మాయేననిపించింది.

ఆ పిలవడం కారు డ్రైవర్నని తెలిసిపోతుంది.

చీకట్లో నీడలుగా కనబడుతున్నారు మనుషులు... 'బాషా' అనబడే డ్రైవరు వాళ్ల గదిలోకెళ్లాడు. మళ్లీ నిశ్శబ్దం. లోపల వాళ్ల గదిలో చిన చిన్నగా మాటల శబ్దాలూ... నా నిశ్శబ్దపు నిశ్చలనపు కొలనులోకి వచ్చి పడ్డ రాళ్లలా వున్నారు వాళ్లు...

నాగదికీ వాళ్ల గదికీ ఒకే కారిడార్. ఈ రెండు గదుల వెనక్కి చిన్న చిన్న గదులూ డార్మిటరీలూ చాలా వున్నాయి.

ఓ పదిహేన్నిమిషాల్తర్వాత ఆ అమ్మాయే మళ్లీ బైటికొచ్చి "వాచ్మెన్" అనరిచింది. ఆ అమ్మాయి సిలవెట్ యిప్పుడు బాగా కనబడుతోంది.

వాళ్ల గది వెలుగు తెరిచిన తలుపులోంచి కారిడార్ చీకట్ని ఓ చారికలా నాకేసింది. ఆ అమ్మాయి పేంటూ టీ షర్టులలో వుంది. వాచ్‌మన్ ఎక్కడో వున్నాడు...

ఆ అమ్మాయి "వాచ్మెన్! వాచ్మెన్!" అని పిలుస్తో నావేపు వచ్చింది.

బాగా దగ్గరగా వచ్చేవరకూ నేనా అమ్మాయికి కన్పించలేదు. నా దగ్గరగా వచ్చేసింతర్వాత టీపాయ్‌ని తన్నుకోబోయి ఆగిపోయింది.

"ఓ అయాంసారీ, అయాం లుకింగ్ ఫర్ద వాచ్మన్... యూజ్వీ ఎనీవేరా రౌండ్?" ఇంగ్లీష్‌లో మర్యాదగా అడిగింది.

నేనూ మర్యాదగానే నాకు తెలీదన్చెప్పాను.

మళ్లీ ఓసారి సారీ చెప్పి వాళ్ల గదికేసి మళ్లీ వెళ్తూవెళ్తూ "అమ్మా వాడిక్కడెక్కడా లేడే... కన్పిచ్చట్లేదూ" అని అచ్చతెనుగులో అరిచింది.

వో తెలుగువాళ్లన్నమాట... అనుకున్నా.

వాళ్లు వాళ్ల గదిలో పదిలమైపోయి, నానించీ వాళ్లు దొంగిలించిన నిశ్శబ్దాన్ని నామీదకు విసిరేసారు... దయతల్చి...

చాలాసేపు చీకట్లో అలాగే సముద్రపు హోరు వింటూ...

ఎప్పుడో నిద్రలోకి జారుకున్నా... మత్తులోకా?!

** ** **

సెల్‌ఫోన్లో సెట్ చేసుకున్న అలారమ్ మోతతో మెలకువ...

ఓహ్ నాలుగయ్యింది...

ఆకాశం యింకా ఇరుల కురుల్లో తారకల్ని చెక్కుతూనే వుంది... సముద్రం యుగాల అవిశ్రాంత ఘోషను వినిపిస్తూనే వుంది. కన్యాకుమారిలో సూర్యోదయ చిత్రం ఒక మహాద్భుతమైన చిత్రం...త్వరగా తయారవ్వాలని గదిలోకి నడిచా... స్నానంచేసి తెల్లటి లాల్చీ పైజామాల్లోకి మారి, గదికి తాళంవేసి సముద్రంవేపు అడుగులేసా...

గదిలోంచి బైటపడేప్పుడు అప్రయత్నంగా పక్కగదికేసి చూసా... తలుపులు బంధించే వున్నాయి. సముద్రపు ఒడ్డుకు జనాలు చేరుతున్నారు. చీకట్లోనే వేటకు వెళ్లే పడవలు అలలమీద చారికల్లా వూగుతున్నాయి. అందరి దృష్టీ ప్రాచీరేఖ మీదే...

కొన్ని యుగాలుగా ప్రకృతి మనిషికి విభ్రమ కలిగిస్తూనేవుంది అన్నట్టు... అందరూ తీక్షణంగా క్షతిజ రేఖనే...

చినచిన్నగా తూర్పున ఆకాశపు నలుపు పలచనౌతోంది. రక్తవర్ణం... కానీ అందర్నీ నిరాశ పరుస్తూ మబ్బులు కనిపించసాగాయి.

మబ్బులు దయచేసి వదలివేసిన సందుల్లోంచీ సూర్యరేఖా రక్తిమ... సంపూర్ణ సూర్యబింబాన్ని రక్తవర్ణంలో చూడాలనుకునేవాళ్లకి నీరసం...సముద్ర స్నానాలు చేసేవాళ్లు చేస్తున్నారు.

ఎన్ని సముద్రాల్ని నామీంచి పొంగించినా వదలించుకోలేని శూన్యంవున్నవాణ్ణి నేను. చిన్నగా గదివేపు కదిలా. నా వెనగ్గా పక్కగది వాళ్లు వస్తున్నారన్న దానికి నిదర్శనగా నా వెనక అరకొరగా వినబడ్తూన్న తెలుగు మాటలు.

నేను గది తెరవకుండా బైట పేము కుర్చీలో కూచుని సిగరెట్ వెలిగించా...

ఆ అమ్మాయీ ఆ అమ్మాయి తల్లీ తండ్రీ ముగ్గురూ మెట్లెక్కుతున్నారు. వాళ్లు వరండాలో కొచ్చింతర్వాత కుతూహలంగా తలెత్తి చూసా.

వాళ్లూ నన్ను చూసారు...

ఒక్కసారి నా కళ్లను నేను నమ్మలేకపోయా.

ఆ అమ్మాయికీ అతనికీ మధ్య సుభద్ర!

ఎప్పటి సుభద్ర! సరిగ్గా పాతికేళ్లైంది...

అటు సుభద్రా అంతే ఆశ్చర్యంతో చూస్తోంది. నెమ్మదిగా నడిచొచ్చి నోరారా పేరుపెట్టి పిలిచింది.

"ఎట్లావున్నావ్?" ఆప్యాయంగానే అడిగింది.

ఏమని చెప్పాలి బాగాలేనని చెప్పాలా? చిన్నగా నవ్వి- "నువ్వెలా వున్నావ్!" అడిగా.

కుతూహలంగా చూస్తూన్న ఆ అమ్మాయినీ అతన్నీ పిలిచి "మా వారు భార్గవ... పాప ప్రియ" పరిచయం చేసింది.

"హీ యీజ్ మై కాలేజ్‌మేట్ సీనియర్... ఇప్పుడో రచయిత... ప్రియా నువ్వు చదివావు ఓ రెండు నావెల్స్...యితనే" నన్ను వాళ్లకి పరిచయం చేసింది.

అంతేనా భద్రం? మనం ఒకే కాలేజ్‌లో ఎప్పుడు చదివాం? నేన్నీకేమీ కానా? ఇప్పుడు కాకపోయినా అప్పుడెప్పుడో నీకు నేనేమీ కానా? నీ కుడి తొడమీది గాయపు మచ్చ మీద ముద్రలేసిన నా పెదవులకైనా చెప్పు...

భార్గవ "హలో" అని చెయ్యి కలిపాడు.

"నమస్తే అంకుల్" అని ఆ అమ్మాయి నవ్వింది.

"రండి టిఫిన్ చేద్దాం" ఆహ్వానించాడు భార్గవ.

మర్యాదగా నవ్వి థ్యాంక్స్ చెప్పి నా గది తెరిచి లోపలికెళ్లి తలుపులేసుకున్నా...

** ** **

ప్రేమలూ గ్రట్రా నా విశ్వాసానికందవు...

స్త్రీపురుష సంబంధాలమీద సమాజం విధించిన కట్టుబాట్లు నేనేనాడూ లెక్కచేయలేదు.

సుభద్రని పాతికేళ్ల క్రితం యిష్టపడ్డా... తన అందం నన్ను సమ్మోహితుడిని చేసింది... మా

> దాదాపు మా పెళ్లి గురించి మాటలు కూడా మాట్లాడేసుకున్నాం మేమిద్దరం. నేను నా పాత పరిచయాల్ని రహస్యంగానే కొనసాగించా... కొన్నాళ్ల తర్వాత తను ఎమ్మెస్సీ లో వున్నప్పుడు నా తాగుడు గురించి తెలిసింది. కొద్దిగా వాదించుకున్న తర్వాత తనే వూరుకుండిపోయింది... కారణం వాళ్ల నాన్నకూడా అప్పుడప్పుడూ పుచ్చుకోడమే...

పక్కింట్లో పారిజాతాలేరుకునేందుకు వచ్చేది.

మొదటిసారి చూడంగానే పడిపోయా...

బైట కాలేజీకివెళ్తూ కనిపించేది... చూడనట్టే చూసేది.

తన గురించి బాగా ఎంక్వైరీ చేసా... నాన్న డాక్టరు... ఇంట్లో పెద్దగా నిబంధనలేమీ వుండవు. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబమే అయినా మరీ చాందసంలేని కుటుంబం. తను బిఎస్సీ చదువుతోంది.

సరే అన్ని తాపాలూ పడ్డ తర్వాత కరుణించింది.

షరా మామూలుగా... నువ్వంటే నాకంత యిదీ... నువ్వు లేక నేను లేనులాంటి నాన్సెన్స్ చాలా నడిచింది. నా ఫ్రీ సెక్సు జీవితం గురించీ నా తాగుడు గురించీ మాత్రం దాచాను. నాకు తెలుసు ఈలోకం దాన్ని మోసమంటుందని. అయినా సుభద్రకోసం ఆ మోహన సౌందర్యం కోసం నాకు తప్పలేదు. నిజానికంత వరకూ పెళ్లి ఊహ కూడా లేని నేను సుభద్రను పెళ్లి కూడా చేసుకోడానికి సిద్ధపడ్డా...

దాదాపు మా పెళ్లి గురించి మాటలు కూడా మాట్లాడేసుకున్నాం మేమిద్దరం. నేను నా పాత పరిచయాల్ని రహస్యంగానే కొనసాగించా... కొన్నాళ్ల తర్వాత తను ఎమ్మెస్సీలో వున్నప్పుడు నా తాగుడు గురించి తెలిసింది. కొద్దిగా వాదించుకున్న తర్వాత తనే వూరుకుండిపోయింది... కారణం వాళ్ల నాన్నకూడా అప్పుడప్పుడూ పుచ్చుకోడమే... ఫ్రీ మారిటల్ సెక్స్ గురించి తనకు వ్యతిరేకతున్నా నా మీది ప్రేమతో అంగీకరించింది.

కానీ ఓ ఆదివారం మధ్యాహ్నం... ఝాన్సీ గదికొచ్చింది చాలారోజులైంది ఎందుకని కలవడంలేదంది... మీదపడింది... నేను నేనేకదా...


'వంట చేస్తా వెళ్లి బ్రాందీ తీసుకురా' అంది.

అట్లా సెలబ్రేట్ చేసుకుని ఎన్ని రోజులైందోనని వెళ్లి బ్రాందీ తెచ్చా. ఝాన్సీ కమ్మగా చికెన్ వండింది... తాగాం తిన్నాం... సుఖించాం...


సంధ్యవేళ చిరుగాలిలా వచ్చిన సుభద్ర అర్ధనగ్నంగా ఝాన్సీని... నన్నూ... నగ్నంగా పడివున్న బ్రాందీ సీసానూ చూసి తుఫానుగా మారింది.

ఝాన్సీ నిశ్శబ్దంగా నిష్క్రమించింది.

ఏం మాట్లాడాలో తెలీక సిగరెట్ వెలిగించుకుని సుభద్ర ముందు మౌనంగా కూచున్నా... సుభద్ర చిన్నగా కంపిస్తూన్న స్వరంతో...



"నువ్వు తాగుతావని తెలిసి బాధపడిపోలేదు. పెద్దదానిలా నీకు పాఠాలు చెప్పి... జీవితమూ... ఆశయాలూ... కలలూ గురించి మాట్లాడాను. అర్థరహితంగా జీవితాన్ని వ్యసనాల పాలుచేసి తిరగడం తప్పు అన్చెప్పను... నీతో శారీరికంగా కలిసి నేను తప్పు చేసాననీ అనుకోను... మత విశ్వాసాలు లేని... రేపటి పట్ల ధ్యానలేని... జీవితాన్ని ఈజీగా తీసుకునే నీతో మనుగడ సాగించడానిక్కూడా సిద్ధపడ్డాను... కానీ... కానీ... ఈరోజున... నో... నాకర్థమైంది... నీకు ప్రేమ ఆరాధనల పట్ల అస్సలు విశ్వాసంలేదు. అయాంసారీ అయాం లీవింగ్ ఫరెవర్" అన్చెప్పి వెళ్లిన సుభద్ర... ఈరోజున అకస్మాత్తుగా ఎక్కడో యీ కన్యాకుమారిలో... సముద్రపు హోరు మధ్య... యిలా...



ఓ అర్థంలేని చిరునవ్వు మొలిచింది.

సుభద్ర తర్వాతా ముందూ నా జీవితంలో చాలామంది ఆడవాళ్లు వచ్చారూ వెళ్లారూ... ఎవరి గురించీ కంప్లైంట్స్ లేవు. వాళ్లకెవ్వరికీ నామీదా కంప్లైంట్స్ లేవు. లేదూ లేవని నేననుకుంటున్నానేమో! సుభద్ర నా జీవితం నించీ నిష్క్రమించాక కొద్ది వెల్తి అనుభవించా. తర్వాత మామూలే.

ఈ ఏభైరెండేళ్ల జీవితంలో చాలాదూరం నడిచొచ్చా...

అందిన మేరా శారీరకానందాల్ని దొరకబుచ్చుకున్నాను. ప్రపంచాన్ని వీలైనంత మేర చూసాను. నాకున్న భాషా పరిజ్ఞానాన్ని ఉపయోగించి భావను ధ్వంసం చేస్తూ తోచిన రాతలు రాయడం మొదలుపెట్టా... మతవిశ్వాసాలు లేనితనం... శృంగారం పట్ల నాకున్న అభిప్రాయాలూ... నాకున్న వ్యసనాలూ... చీకటీ జుగుప్సా నే చూసిన అసహ్య ప్రపంచపు నగ్నరూపాలను చూపుతూ తెలుపుతూ నే రాసే రాతలు మొదట పత్రికలు ప్రచురించడానికి వెనకాడినా చిన్నచిన్నగా ప్రచురించడం ప్రారంభించాయి.

విధ్వంసక రచయితగా, సభ్యాసభ్యతలూ సంస్కారమూ లేని రచయితగా, వ్యసనాలకు పంచవర్ణాలు పులిమేవాడిగా చాలామంది భద్రలోక జీవులు ఛీత్కరించినా... కొద్దోగొప్పో చిన్నసైజు మేధావిగా పేరు తెచ్చుకున్నా.

ఓ పది పుస్తకాలు అమ్ముడేసా...

ఒక్కో రచనా నాలోంచీ బైటపడుతూండగా... నాలోపల ఆమేర శూన్యం ఆవరించడం... అట్లాగున యిప్పుడూ చాలామటుకూ శూన్యమే. ఆ శూన్యమే లోపలా బైటానూ... దాన్ని మట్టుకునే యిలా తిరుగుతూ తిరుగుతూ కన్యాకుమారికి... నా మొదటి నవల రాసిన ప్రాంతంలో, దానికోసం నేమింగిన శూన్యానికర్థం దొరుకుతుందనే ఓ పిచ్చి ఆశతో యిలా వస్తే- సుభద్ర! ఇన్నేళ్ల తర్వాత...

** ** **

నేను గదిలోంచి బైటికి వచ్చేసరికి పక్కగది తాళమేసుంది. మెట్ల మీద కూచున్న వాచ్మెన్ని అడిగా ఖాళీ చేశారా? అని లేదన్నాడు...

సుభద్ర మీద నాకున్నవి ఏమిటి? అనాలోచించా... ఇష్టమే... నేను ఇష్టాన్నే ప్రేమంటాను నేను విస్కీని ప్రేమిస్తాను, పుస్తకాన్ని ప్రేమిస్తాను, సముద్రాన్ని, సముద్రంలాంటి సంగీతాన్నీ... రంగుల్నీ ప్రేమిస్తాను...

సుభద్ర తాను కలలుగన్న ప్రేమా, ఆరాధనా... అనుకున్న ఆదర్శాలూ తృప్తీ అన్నీ పొందిందా ఒక వేళ తాను పొంది వుంటే నాలోపలి శూన్యానికి అర్థం కొంతమేరైనా దొరకవచ్చునేమో...

నన్ను పరిచయం చేస్తున్నప్పుడు సుభద్రలో నిజాయితీ లోపించడంలో నాకేతప్పూ కనిపించలేదు. అందులో వాస్తవ దృక్పథం వుంది. నేను కాలేజ్మేట్ని కానూ ఒకప్పుడు అసలుసిసలు మేట్ను అన్చెప్పి తన భద్ర జీవితానికి ప్రమాదం కొని తెచ్చుకోలేదు కదా...

నలభై అయిదేళ్లు వచ్చినా అదే నాజూకుతనంతో పది సంవత్సరాలు చిన్నగా కనబడ్తోంది. తల్లీ కూతుళ్లిద్దరూ అక్కాచెల్లెళ్లలాగున్నారు.

మగ మృగం... అదుగో మళ్లీ... శూన్యంలోంచీ పదార్థ వాసనలు! సెహబాష్... నేను రాసిన నవల్లో కథల్లో సుభద్రని వెదుక్కోడం మొదలైంది. నా నవలల్లో కథల్లో కాల్పనికత స్వల్పమే... యదార్థానికి భాష జరీ ముసుగేసేస్తూంటా... నా రచనల్లో మనిషికి మనిషితత్వాన్ని మనో దర్పణంలో చూపించడం ద్వారా, సాంప్రదాయవాదులకు అవి అప్రాచ్యపు రాతలై కూచున్నాయి. వాళ్ల నగ్నత్వాన్నివాళ్లు దర్శించలేరుకదా! పైగా ఎవడో వచ్చి వాళ్ల నగ్న వ్యక్తిత్వాల ఫోటోలని వాళ్లకి చూపితే వుండదూ!

"ఈమధ్య నీ గురించి వింటున్నా... విపరీతంగా తాగుతున్నావట?"
"కొత్తగా ఏమీ తాగట్లేదుకదా... నీకు తెలుసు పాతికేళ్ల అలవాటిది. వ్యసనపరుణ్ణి అని ఆరోజే అనేసి వెళ్లావు ఈరోజు కొత్తగా అడుగుతున్నావు... నా సంగతి సరే మీ ఆయనేమిటీ?" దెబ్బకొట్టాననుకున్నా.

నిజమే నా నవలల్లో కథల్లో సుభద్ర అలవోకగా వచ్చి తొంగిచూసి పోతూంటుంది... ఒక్క సుభద్రేనా?

రత్న... మేరీ... యూనీ... రూప... ఎందరూ? అందరూ లేకపోయిన కొందరైనా...

ఏమిటిది సుభద్రనిచూడగానే- ఉదయాన వున్న నిరాసక్తత, శూన్యభావం. కొంతమేర తగ్గినట్టు?

'ప్రకృతీ! స్త్రీ' నీకు శతకోటి వందనాలు....

** ** **

బైటికి కదిలా ఎండచురుక్కుమంటోంది. సముద్రపుటుప్పు వాసన... చెమట ఆరని తనం...

పుస్తకాలు, నత్తగుల్లలూ, శంఖాలూ, గవ్వలూ అమ్మే అంగళ్ల మధ్య విదేశీ వస్తువులు అమ్మే అంగళ్లూ...

ఓ పుస్తకాల షాపులో దూరా... జిడ్డూ... ఓషో... వివేకుడూ... రామకృష్ణుడూ... అరవిందుడూ... కామసూత్ర ఖజురహో బొమ్మలూ...

రజనీష్కదా అంది జిడ్డు కృష్ణమూర్తి గురించీ! 'అతను అపోహలు తొలగిన వ్యక్తి' అని. కృష్ణమూర్తికి ఏ అపోహాలుండి వుంటాయి? రజనీష్ డిజిల్యూషన్గా మరణించి వుండడా?

'హెలో అంకుల్!' సుభద్ర కూతురు ప్రియ.

"హెలో" వాళ్లమ్మలా లేదూ. వాళ్ల నాన్నలా లేదీ అమ్మాయి. అందంగా అయితే వుంది. ఓ ఇరవై ఇరవైరెండేళ్లుండొచ్చు. బ్లైట్ జీన్స్... టీ షర్ట్ వేసుకునుంది.

శూన్యమా!నువ్వెక్కడా? నిర్లిప్తతా నీరంగేమిటీ?

"ఉత్తినే తిరుగుతున్నానంకుల్ అమ్మానాన్న పూజలు చేస్తున్నారు నాకవన్నీ పడవ్... అందుకే యిలా"

"ఆ అమ్మాయిని ఎలా సంబోధించాలో 'నువ్వు' అనా 'మీరూ' అనా...

"ఆహా" అన్నాను...

"నేను మీ బుక్స్ రెండు చదివానంకుల్... లాంగ్వేజ్ చాలా కష్టం... కానీ కొన్నికొన్నిచోట్ల మీరు మరీ ఎరోటిగ్గా రాస్తారూ... అమ్మెప్పుడూ మీరు తనకి తెల్సు అని చెప్పలేదు ఎందుకో"

నవ్వేసి ఊరుకున్నా...

"అయినా ఈ ఏజ్లో అట్లా ఎట్లా రాయగలరూ మీరు?" కొంటెగా అడిగింది ప్రియ.

"నేను సరే కుష్వంత్సింగ్ని ఆ మాటడిగితే ఏమంటాడో మరి?" గట్టిగా నవ్వుతూ అన్నాను షాపు బైటికి దారితీస్తూ...

బైటికి దారి ఇరుకుగావుంది. మగాలోచన మెరుపువేగంతో పనిచేసేసింది... ఇరుకుగా వున్న దారి పక్కకి జరిగి ప్రియని ముందు వెళ్లమన్నట్టు సైగ చేసా... ఆలోచన ఫలించింది. ప్రియ నన్ను తాకుతూ వెళ్లింది... రాచుకుంటూ వెళ్లింది... చెమటా... చేసుకున్న స్ప్రే కలగలిసిన ప్రాకృతిక పరిమళం... ప్రియ నన్ను నా కాళ్లను ఒరుసుకుంటూ వెళ్లినప్పుడు నా కాళ్లను తాకుతూ ఆ అమ్మాయి పిరుదు...

దే హ్యాస్ట్ బార్న్ అబీస్ట్ దే విల్ డై అబీస్ట్
పునరపి జననం పునరపి మరణం...

"అంకుల్ గెస్ట్హౌస్కెళ్దామా... యిక్కడ బాగా ఉక్కగా వుంది చెమటలు విపరీతంగా"

వద్దు వద్దొద్దు...

చుట్టూ జనసమూహం... ఒంటరిగా నేను... ఒక్క నేనేనా... హాహాహ ప్రియ కూడా కదా... నా తటపటాయింపు చూసి

"హో నాకర్థమైంది లెండి మీ ఇబ్బంది... మనిద్దరమే అనికదా? అయినా మీరేం చేస్తారంకుల్ నన్నూ"

వద్దు వద్దు వద్దూ మృగాన్ని రేకెత్తించవద్దూ...

"హహ్హహా... నిజంగా ఏమైనా చేసేసాననుకో..."

దబీస్ట్ టుక్‌ద చాలెంజ్...

"కమానంకుల్ అక్కడ కూచుని హాయిగా మాట్లాడుకుందాం"

కాటన్ టీషర్టులోంచి పొడుచుకొచ్చి సవాల్ విసురుతూన్న స్త్రైణం...

నాలుగడుగులేసామో లేదో

"ఏయ్ ప్రియా!" సుభద్ర గొంతు వెనక జన సమూహంలోంచీ.

బెలూనెగిరిపోయింది.

మామూలు పలకరింపులు...

సుభద్ర ఎంత అంటీముట్టనట్టుందీ...! నిజంగా పాతికేళ్ల క్రితం కాలేజ్‌మేట్‌లాగానే! కలిసి మధ్యాహ్న భోజనాలు...

నగ్న పరిచిత సుభద్ర శుభ్రవస్త్ర
శుభ్ర వస్త్రుడ నేను నగ్న చరితుడ
భార్గవ ఆటలో అరటిపండు
ప్రియా? నిషిద్ధ ఫలం...

** ** **

వివేకానంద మెమోరియల్‌కి వెళ్దామని నిర్ణయం. లాంచికి టికెట్స్ తీసుకోడం జరిగింది. లాంచీ కదుల్తోంది. పరిగెత్తి లాంచి ఎక్కాల్సి వచ్చింది. పరిగెత్తడంలో ప్రియనీ సుభద్రనీ పోల్చి చూసుకున్నా... లాంచిలో నేనూ ప్రియా నించున్నాం... ప్రియ నా పక్కనే నించుంది.

సముద్రం పోటు మీదుంది.

ఒక్కసారిగా లాంచిని కుదిపి ఊపిందో పెద్ద అల...

ప్రియ ఒక్క కేరింతతో నన్ను నిలువెల్లా కావలించుకుంది పడిపోతానేమోనని...

ల్యావెండర్ మొలకెత్తి... పైపైకి పాకి విడిచి విప్పారి గుబురుగా పెరిగి నిలువెల్లా పూచింది.

సుభద్రవేపు చూసా అప్రయత్నంగా...

నాకు మాత్రం కనిపించే ఎర్రజీర.. సుభద్ర కన్ను నాకు ప్రమాద సూచి...

సముద్రపుటల విసిరిన జల్లుతో తడిసిన ప్రియ వెంట్రుకలు నా పెదవులకు ఉప్పగా... ప్రపంచ మోహాల వంటల రుచుల రుచిర దేహాల రహస్యంగా...

ఉప్పు... ఉప్పు... ఉప్పు...
స్వేదం... ఖేదం... అసహ్యం...
దేహ్యాస్ట్ బార్న్ అబీస్ట్...
పునరపి... పునరపి
నేన్చావన్గాక చావను...

మూలనించీ వివేకానంద మెమోరియల్ని మెరిసే కళ్లతో చూస్తూ భార్గవ.

** ** **

రాత్రి అందరం కల్సి భోజనం అన్న ప్రస్తావన తెచ్చాడు భార్గవ. నాకు అనీజీగా వుంది. అసలు సుభద్రన్చూస్తూంటే తన సుఖమయ జీవితాన్ని చూపి నన్నెద్దావా చేస్తున్నట్టు అనిపిస్తోంది.

ఇక ఈ ఆట ఆడటం నావల్లకాదు.

భార్గవకు డైరెక్టుగా చెప్పేసాను. "నేను డ్రింక్ తీసుకోంది భోజనం చేయన"ని...

"వెరీగుడ్ దెన్ యూహ్యావ్ కంపెనీ" అన్నాడు.

సుభద్ర చిర్నవ్వు నవ్వుతోంది.

నాకు చిరాగ్గా వుంది... కసిగా వుంది.

సరే సుభద్ర ఎంతవరకూ లాగగలదో ఈ నాటకాన్ని చూద్దాం అని "సరే" అనేసా..

సుభద్రకీ ప్రియకీ బ్రాహ్మణ భోజనాలు తెప్పించాడు భార్గవ. మాకోసం గైటర్ ఫ్రాన్స్ ఫిష్ తెప్పించాడు... నేను ఆర్సీ తీసాను...

ప్రియ ఆకలి ఆకలి అంటూ ముందే భోం చేసేసింది... కాస్సేపు కూచుని నిద్రొస్తోందని వెళ్లిపోయింది.

నాకా అమ్మాయి మీద ఆసక్తి తగ్గిపోయింది.

నేనూ సుభద్రా భార్గవ ఎదురుగా సముద్రం.

కాసేపు నా సాహితీ వ్యాసంగం గురించీ, ఇంకాసేపు భార్గవ బిజినెస్ గురించీ, అనాసక్తంగా ప్రాపంచిక విషయాల గురించీ మామధ్య సంభాషణ.

భార్గవ కంపెనీ కంపెనీ అంటూ మూడు రౌండ్లు తీసుకున్నాడు.

సుభద్రవేపు ప్రశ్నార్థకంగా చూసా...

అదే చిర్నవ్వు...

వున్నట్టుండి గమనించా మా ముగ్గురి మధ్యా

నిజానికి నువ్వు ప్రియని కావలించుకోవల్సిందేకానీ ఆ భావనతో కాదు... కావలించుకోవల్సిందే అని ఎందుకన్నానో తెలుసా... ప్రతి తండ్రీ తన కన్నకూతుర్ని జీవితంలో ఒక్కసారైనా నిండైన ఆప్యాయతతో కౌగిలించుకోవాలి కాబట్టి...

సముద్రపు ఘోష తప్ప ఏమీవినిపించడంలేదని...

భార్గవ కుర్చీలో జోగుతున్నాడు.

సుభద్ర అతన్ని లేపింది... ఊహూం అలవాటు తప్పి ఎక్కువ తీసుకున్నాడేమో... నేనూ సుభద్రా కలిసి లోపలికి అతన్ని చేర్చాం...

సుభద్రా నేనూ ఏకాంతం... సముద్రం... మిగిలాం...

నేను కోరిన అవకాశం వచ్చింది.

సుభద్రకూ నాటకం తెరదించేసిన ఆయాసం రిలీఫ్.

"ఏమిటీ నాస్తికుణ్ణి అన్చెప్పుకునేవాడివి తీర్థయాత్రలు చేస్తున్నావ్?"

నవ్వొచ్చింది నాకు నవ్వి ఊరుకున్నా...

"ఈమధ్య నీ గురించి వింటున్నా... విపరీతంగా తాగుతున్నావట?"

"కొత్తగా ఏమీ తాగట్లేదుకదా... నీకు తెలుసు పాతికేళ్ల అలవాటిది. వ్యసనపరుణ్ణి అని ఆరోజే అనేసి వెళ్లావు ఈరోజు కొత్తగా అడుగుతున్నావు... నా సంగతి సరే మీ ఆయనేమిటీ?" దెబ్బకొట్టాననుకున్నా.

"మళ్లీ అదే చిర్నవ్వు... నిజమే ఆయన తాగుతారు కానీ అది ఆయనకు వ్యసనం కాదు. ఇదుగో ఇలా ఎప్పుడో... అంతే"

"ఓహ్ చాలా మంచి ఇల్లాలివయ్యావు భర్తని బాగా వెనకేసుకొస్తున్నావు" నవ్వుతూ అన్నా.

"సరే నా సంగతలా వదిలేయి... ఏమిటి నీ జీవితం? ఏభైదాటాయి... ఎన్నాళ్లిలా... జీవితానికి అర్థం గమ్యం అంటూ ఏమీలేవా... చెప్పు" ఆప్యాయంగా అడిగింది.

"సుభద్రా నీకో సంగతి చెప్పనా, ఈ మహా ప్రపంచంలో జీవితానికి అర్థం గమ్యం అంటూ ఆలోచించేది ఒకేఒక జీవి... మనిషి. మిగిలిన ప్రాణికోటికి పుట్టడం, పెరగటం, పునరుత్పత్తి, చావడం జీవితం అంతే... మనిషి తద్భిన్నమైనవాడు అనుకోడం నాన్సెన్స్"

"నువ్వు మారవు... నీ మేధ చాలా గొప్పది నేనొప్పుకుంటా... నీ పుస్తకాలు కూడా చదువుతున్నాను. యూ ఆరె పర్వర్టెడ్ జీనియస్. అయినా చెప్పు ఎందుకొచ్చావిక్కడికి?" మళ్లీ ఆత్మీయంగా అడిగింది.

నాకు లోపలెక్కడో తడిసిన భావన.

సుభద్ర... ఈ సుభద్రను మాత్రమే నేను జీవిత భాగస్వామిగా కనీసం ఊహించింది. దీన్నేనా ప్రేమ అంటారు. నాన్సెన్స్. కానీ సుభద్రకు నిజం చెప్పాలన్పించింది. తనకి దగ్గరగా జరిగా... దూరంగా తొలగిపోలేదు సుభద్ర. చేయి మీద చేయి వేసా... తొలగించలేదు.

"భద్రం!" మునుపటి పిలుపు పిలిచా.

'చెప్పు' అన్నట్టు ఆత్మీయంగా చూసింది.

"భద్రం! నిజం చెప్పనా... నిన్నుడికించాలనియిలా మాట్లాడుతున్నా కానీ... ఏదో శూన్యం నన్ను వెంటాడ్తోంది... సుఖాలు... ఆనందాలూ కొద్దిసేపే... అవి అంతంకాగానే తెలియని శూన్యం దాంతో అసహనం... ఏం చేసి దానికి జవాబు కనుక్కోవాలో తెలీటంలేదు" అన్నాను.

నా చేతిమీద చెయ్యేసి ఆర్ద్రంగా అంది సుభద్ర... "నీకన్నీ తెలుసు అనుకుంటావు నువ్వు... ప్రతి వస్తువు... ప్రతి స్త్రీ... ప్రతి అనుభవం... నీకు కావల్సింది నీకు అందింది... అందకపోతే అంది పుచ్చుకున్నావ్... వాటికోసం వెంపర్లాడావు... నువ్వు కోరుకున్నవన్నీ నీ దగ్గరున్నాయి... అయితే నీ శూన్యానికి కారణం నిన్ను... నిన్నా కోరుకున్నది నీ దగ్గర లేకపోడమే... నీకు ఇష్టం తప్ప ప్రేమా అనురాగం ఆరాధనలపట్ల విశ్వాసం లేదు. అది అర్థరహితంగా నీకు కనిపించడమే నీ శూన్యం. నీకోసంగతి చెప్పాలి... తప్పదు. నేచెప్పే విషయం నీ శూన్యానికి అర్థం చెప్పొచ్చూ చెప్పకపోవచ్చు... అయినా నీకు చెప్పాలి ఆ విషయం. ఈరోజున లాంచిలో ప్రియ నిన్ను కౌగిలించుకున్నప్పుడు నిన్ను చూసాను... అప్పుడు నీ మొహంలో కలిగిన భావావేశాన్నిచూసాను. నీలో కామోద్రేకం కనిపించింది. నిజానికి నువ్వు ప్రియని కావలించుకోవల్సిందేకానీ ఆ భావనతోకాదు... కావలించుకోవల్సిందే అని ఎందుకన్నానో తెలుసా... ప్రతి తండ్రీ తన కన్నకూతుర్ని జీవితంలో ఒక్కసారైనా నిండైన ఆప్యాయతతో కౌగిలించుకోవాలి కాబట్టి..." ఆగి కన్నీళ్లు తుడుచుకుంది సుభద్ర....

"సుభద్రా! ఏమిటి నువ్వనేది?"

"యస్ నిన్నొదిలి వచ్చిన్రోజున నేను..." అని మళ్లీ కళ్లు తుడుచుకుంది.

సముద్రపు హోరు నా చెవిలో...

"నాకు నీమీద ప్రేమ, ఆరాధన.. ఈరోజున లేవు అవి చచ్చిపోయాయని చెప్పలేను. ఇలా అన్నానని మరోలా అర్థం చేసుకుని నన్నుగానీ ప్రియనుగానీ కలవడానికి ప్రయత్నించకు గుడ్ బై" కదలబోయింది.

గబుక్కున చెయ్యి పట్టుకొని ఆపాను.

"భద్రం! ప్రియ... ప్రియ... యూమీన్ షీయీజ్ మై... ఆ?"

"యస్. గుడ్‌బై" అని నా తల తడిమి వంగి నుదిటిమీద ఓ మంచు ముద్రవేసి నీడలా, పొగలా, ఆకాశంలా సుభద్ర కదిలిపోయింది.

ఉదయం నేను లేచేప్పటికి వాళ్ల గది తాళమేసుంది...

సముద్రం తన పురాతన ఘోష వినిపిస్తూనే వుంది....

నాలోపలా... బైటా... ఘోష... ●